31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం, నవంబర్ 17 , 2026 పేజీలు : 8

ధర్మపురి అభివృద్ధి బాధ్యత నాదే

-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 16: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి అభివృద్ధి బాధ్యత తనదేనని, పుష్కరాల పనులకు నిధులు విడుదల చేయించి పనులు ప్రారంభించామని తెలిపారు. ధర్మపురి మున్సిపల్ మున్సిపాలిటీ పరిధిలోని -మిగతా 2లో

జర్నలిస్టుల
సంక్షేమానికి కృషి చేస్తా



- ప్రభుత్వానికి ప్రజలకు వారధులు పాత్రికేయులు
- ఖాళీస్థలంఉన్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 16: జర్నలిస్టుల కష్టాలు నాకు తెలుసని మీ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా రాయికల్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాళీ స్థలం ఉన్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకం అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి సంక్షేమంలో పాలుపంచుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రజల -మిగతా 2లో

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



చురకలు ప్రతినిది ఎల్లారెడ్డిపేట నవంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐకేజేబీపీ) అమలుపై సోమవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓలు, డీఆర్డీఓ, సీపీఓ, డీపీఓ, డీసీఎస్ఓ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలకు పథకం అమలుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1,92,000 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేషన్ కార్డు ఉన్నా లేకున్నా అర్హులే!.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఉన్నవారితో పాటు రేషన్ కార్డు లేనివారు కూడా అర్హులేనని తెలిపారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల విలువైన జీవిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. బీమా పొందే వ్యక్తులు తమ నామినీలుగా ఎంతమందినైనా ఎంపిక చేసుకోవచ్చని, దరఖాస్తులో నామినీ వివరాలతో పాటు బీమా పరిహారానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేసి సంతకం చేయాలని సూచించారు.

ప్రత్యేక శిబిరాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిబిరాల వద్ద హెల్ప్ డెస్క్‌లు, టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జగిత్యాల మార్కెట్ యార్డును
చల్ గల్‌కు తరలించాలి

- తక్షణమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి





చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 16: జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ మార్కెట్ ను పూర్తి స్థాయిలో చల్గల్ మార్కెట్ యార్డుకు తరలించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. బీట్ బజార్ మార్కెట్ ను సోమవారం ఆయన జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మార్కెట్ కు తీసుకొచ్చిన తర్వాత ధర తగ్గిస్తున్నారని, ఆరుగాలం కష్టపడి పండిస్తే అమ్ముకునేందుకు స్థలం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో జీవన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి సాగు అధికంగా ఉన్న నేపథ్యంలో 2009లో తానే 25 ఎకరాలు కేటాయించి జగిత్యాల మార్కెట్ ను ఏర్పాటు చేశానన్నారు. రైతులు -మిగతా 2లో

విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

- నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- ఎస్పీ అశోక్‌కుమార్





చురకలు విలేకరి, మెట్ పల్లి, నవంబర్ 16 : విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడం, నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు నాణ్యత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం మెట్ పల్లి పోలీస్ స్టేషను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టేషన్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది -మిగతా 2లో

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

-సాలారే మిల్లత్ గైడ్స్ పంపిణీలో

ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్



సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ, నవంబర్ 16 : తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని ఎంఐఎం పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని, గంభీరావుపేట, వేములవాడలో గల ప్రభుత్వ ఉర్దూ మీడియం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్‌ను పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ..ఎస్సెస్సీ విద్యార్థులందరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు కీలకమని, ఈపరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. హైదరాబాద్ మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో, గత 26 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్సను, ఎంఐఎం పార్టీ తరపున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు చెప్పారు. సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలలో, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఎంఐఎం నాయకులు మహమ్మద్ ముస్తఫా, పర్వేజ్, సమీ, గంభీరావుపేట ఎంఐఎం నాయకులు ఇర్ఫాన్ ఖాన్, షోయబ్, గౌస్, హమీద్, అజీజ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి అభివృద్ధి బాధ్యత నాదే

మొదటి పేజీ తరువాయి... 15 వార్డులకు చెందిన 165 మంది నూతన పింఛనుదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లు ఇస్తున్నామని, ఇంకా రానివారికి విడతలవారీగా అందిస్తామని భరోసా ఇచ్చారు. ధర్మపురి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, పుష్కరాల అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రసునాంభ, డీఆర్డీఏ పీడీ రఘువరన్, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి...విధుల కేటాయింపు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం నీట్ టర్నౌవుట్ లో ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. డయల్-112 కు వచ్చే ప్రతి కాల్ని వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి అత్యంత వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణలో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఇన్స్పెక్టర్ లు సురేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, రాజు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల మార్కెట్ యార్డును...

మొదటి పేజీ తరువాయి....
వ్యతిరేకించినా మున్సిపల్ ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కోసం స్థలం కేటాయించ డంతో స్థలం కొరత ఏర్పడిందన్నారు. వెజ్, నాన్ వెజ్ మార్కె ట్ ప్రారంభించినట్లు శిలాఫలకం పెట్టి కాంట్రాక్టర్ సిమెంట్, స్టీల్ పెట్టుకోవడానికి అప్పజెప్పారని, నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా సిమెంట్ బస్తాలు నిల్వ చేసుకోవడా నికేనా నిర్మించారు? అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే దాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు.మొన్నటి వరకు క్వింటాలుకు రూ.3000 పలికిన ధర నేడు రూ.2200కు ఎలా పడిపోయిందని, జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు క్వింటా ధాన్యం కూడా సేకరించలేదని, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుకు వస్తున్నారన్నారు. చల్గల్ మార్కెట్ కు తరలిస్తే రైతులకు సౌలభ్యంగా ఉంటుందని, అక్కడ వే బ్రిడ్జి సదుపాయం ఉందని, పట్టణంలో మార్కెట్ నిలిపివేసి చల్గల్ లో ప్రారంభించాలన్నారు. తక్షణమే చల్గల్ కు పూర్తి స్థాయిలో తరలించి ట్రేడర్లు అక్కడే మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో కలిసి నిజామాబాద్ జాతీయ రహదారిపై అరగంట పాటు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంట కొనుగోలు చేయాలని ఓ మహిళా రైతు సీఐ కాళ్లు మొక్కారు. చల్గల్ మార్కెట్ కు ధాన్యం తరలిస్తామని మార్కెట్ కార్యదర్శి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

మొదటి పేజీ తరువాయి...
మద్దతుతో విమర్శలకు అభివృద్ధే సమాధానం అని తెలిపారు.ఇండ్ల స్థలాల అంశం పట్ల ప్రభుత్వం అనుకూలంగా ఉన్నప్పటికినీ ఇట్టి అంశం కోర్టులో ఉందని పౌర సమాచార మంత్రి,ప్రెస్ అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకపోవడం జరిగిందని అన్నారు.రాయికల్ పట్టణ అభివృద్ధిలో భాగంగాఅమృత్ కార్యక్రమంలో 16లక్షల లీటర్ల ట్యాంక్ నిర్మాణ పనులు,రాయికల్ పట్టణంలో 230 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.రాయికల్ పట్టణానికి చెందిన కామోజి నాగమణి అజయ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి,జగిత్యాల ఎన్ఎస్ యుఐ నాయకులు చెట్టే భార్గవ్ వజ్ర ఎలక్ట్రికల్ వెహికల్ షోరూమ్ ను ప్రారంభించిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజింగి నందయ్య,జేఏసీ,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చింతకుంట సాయికుమార్,గుర్రాల వేణు,ప్రధాన కార్యదర్శి నాగమల్ల శ్రీకర్,సింగిడి శంకరయ్య,కోశాధికారి మచ్చ శేఖర్,కడకుంట్ల జగదీశ్వర్, సీనియర్ పాత్రికేయులు ఎండి ముజాఫర్, నాగిరెడ్డి రఘుపతి,పటేల్ నరేందర్,సయ్యద్ రసూల్,వాసం లింబాద్రి,సింగని శ్యామ్,యాచమనేని కిరణ్ రావు,శంకరయ్య,గంగధారి సురేష్,ఎద్దండి జితెందర్,మాలవత్ వెంకటేష్,అనుపురం లింబాద్రి , చెలిమెల మల్లేశం,గంట్యాల ప్రవీణ్,ఏనుగంటి రాజు,గట్టుపల్లి నరేష్,కోమటి రెడ్డి కృష్ణా రెడ్డి ,కొండ కళ్యాణ్, గన్నవరం గంగాధర్,బెక్కం సుధాకర్,ఇర్ఫాన్, కౌన్సిలర్ పల్లె కొండ గంగాధర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్,మోర హన్మండ్లు,కోల శ్రీనివాస్,గన్నే రాజారెడ్డి,మున్ను,ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రేకుర్తి 22ఏ బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం

చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్ 16 : రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జిల్లా యంత్రాంగం వేగంగా చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన సమగ్ర నివేదిక, ప్రతిపాదనలను ఇప్పటికే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)కు పంపించామని వెల్లడించారు. బాధితులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రభుత్వం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం ఈ సమస్య పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నారని భరోసా ఇచ్చారు.ప్రజావాణి కార్యక్రమంలో రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాలకు చెందిన 22ఏ బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను, సాధకబాధలను ఓపికగా విని, ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను వివరించారు. బాధితుల్లో నెలకొన్న ఆందోళనను తొలగిస్తూ, అనుమానాలను నివృత్తి చేస్తూ, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేకుర్తి పరిధిలోని 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్య దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతోందని తెలిపారు. ఇది ఒక్కరోజులో ఏర్పడిన సమస్య కాదని, దీని వెనుక అనేక సంవత్సరాల భూ రికార్డులు, రెవెన్యూ పరమైన అంశాలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలు ఉన్నాయని వివరించారు. ఈ సమస్యను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లాలో 22ఏ నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క ఎకరం భూమిని కూడా చేర్చలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రేకుర్తి భూములకు సంబంధించిన అంశాన్ని అన్ని కోణాల్లో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు రెవెన్యూ, మున్సిపల్, సర్వే తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన రికార్డులు సేకరించినట్లు తెలిపారు.భూములకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు, మున్సిపల్ రికార్డులు, సర్వే వివరాలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, భూముల కొనుగోలుదారుల వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించినట్లు వివరించారు. బాధితులకు న్యాయం జరిగేలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్తులో వారి వారసులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారంపర్యంగా భూహక్కులను అనుభవించేలా పరిష్కార మార్గాలను ప్రతిపాదిస్తూ సీసీఎల్ఏకు నివేదిక పంపించినట్లు వెల్లడించారు.జిల్లా యంత్రాంగం పంపిన నివేదికను సీసీఎల్ఏ పరిశీలన అనంతరం ప్రభుత్వానికి, అవసరమైన న్యాయపరమైన పరిశీలన కోసం న్యాయశాఖకు పంపించే ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం తనవంతు కృషి చేస్తోందని తెలిపారు.ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నివేదిక రూపొందించారని, జిల్లా నుంచి పంపిన నివేదిక కేవలం 15 రోజుల్లోనే సీసీఎల్ఏ స్థాయిలో తదుపరి పరిశీలన కోసం ముందుకు వెళ్లిందని వివరించారు. సమస్య పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న చొరవకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్య పరిష్కారానికి జిల్లా యంత్రాంగంతో ఈ అంశంపై చర్చిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ప్రజాప్రతినిధులు రేకుర్తి 22ఏ బాధితుల సమస్య పట్ల సానుకూల వైఖరితో ఉన్నారని తెలిపారు.

అర్ధరాత్రి రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన పోలీస్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 16 : రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న బాధితుడికి అర్ధరాత్రి వేళ బ్లూకోట్ కానిస్టేబుల్ తక్షణ సహాయం అందించి ప్రాణాలు కాపాడారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేముల సాయికుమార్ మద్దునూర్ నుంచి తిమ్మాపూర్ కు కారులో వెళ్తుండగా మద్దునూర్ శివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలో పడింది. అర్ధరాత్రి సమయం కావడంతో సహాయం కోసం బంధువులకు ఫోన్ చేయగా మొబైల్ లో బ్యాలెన్స్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డాడు. వెంటనే అత్యవసర నంబర్ 112కు కాల్ చేసి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వెంటనే బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి విధుల్లో ఉన్న బ్లూకోట్ కానిస్టేబుల్ సంపత్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రమాద స్థలానికి చేరుకుని గోతిలో పడిన కారులో ఉన్న బాధితుడిని సురక్షితంగా బయటకు తీసి తక్షణ సహాయం అందించాడు. బాధితుడికి తక్షణమే స్పందించి సహాయం చేసిన కానిస్టేబుల్ సంపత్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో బ్యాలెన్స్ లేకున్నా డయల్ 112 సేవలను వినియోగించుకోవచ్చని ఎస్పీ సూచించారు.

రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 16 : మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అండగా నిలిచారు. జగిత్యాల పట్టణం 2వ వార్డుకు చెందిన రామగిరి మమత మెదడు సమస్యతో బాధపడుతూ ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతుండగా విషయాన్ని స్థానిక కౌన్సిలర్ దయాల చంద్రకళ శంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయాల శంకర్, సర్పంచులు ఆకుల మల్లేశం, నక్క హరీష్, ఆకుల తిరుపతి, రాజన్న గౌడ్, తోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజావాణికి దరఖాస్తులు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (16) : ప్రజా సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ఈ రోజు రెండు వినతులు అందాయి.సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం లో ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి రెండు దరఖాస్తు లను అధికారులు స్వీకరించారు. వీటిలో ఆర్అండ్బీ శాఖకు సంబంధించి ఒకటి, ఆర్డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించి మరొకటి ఉన్నాయి. స్వీకరించిన వినతులను తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు ఎంపిఓ రామకృష్ణ రాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఐఎం నాయకులతో బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ సమావేశం

-జిల్లాలోని పట్టణాలు, గ్రామాల సమస్యలపై ఆరా..
-పరిష్కారానికి అధికారులకు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఫోన్



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్ 16 : జగిత్యాల జిల్లా ఎంఐఎం నాయకులు సోమవారం బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీని కలిసి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల సమస్యలపై ఆయా పట్టణాల అధ్యక్షులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఫోన్‌లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.ముఖ్యంగా కోరుట్ల పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, షాదీఖానా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చడంతో పాటు, నిపుణులైన వైద్యులు,సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు,కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశం లో కోరుట్ల పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు మహమ్మద్ రఫీతో పాటు జగిత్యాల, మెట్‌పల్లి పట్టణాల ఎంఐఎం అధ్యక్షులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ రహదారిని పరిశీలించిన తహసీల్దార్

-లింకు రోడ్డుకు మరమ్మతులు చేపడితే రెండు గ్రామాలకు మెరుగుపడనున్న రాకపోకలు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, నవంబర్ (16) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొజన్ కొత్తూరు నుంచి బర్దిపూర్ గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ లింకు రహదారిని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్ సోమవారం క్షేత్రస్థాయిలోపరిశీలించారు. కొజన్ కొత్తూరు గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యం లో రహదారి పరిస్థితి, భూముల హద్దులను ఆయన పరిశీలించి వివరాలు సేకరించారు. సుమారు 33 అడుగుల వెడల్పు కలిగిన ఈ పంచాయతీరాజ్ రహదారిని కొంతమంది రైతులు ఆక్రమించడంతో రహదారి విస్తీర్ణం తగ్గినట్లు గుర్తించారు.ఈ నేపథ్యంలో రహదారి అసలు హద్దులను పరిశీలించి ,మరమ్మతులు చేపట్టేందుకు అవసర మైన వివరాలతో నివేదికను సిద్ధం చేశారు.కొజన్ కొత్తూరు, బర్దిపూర్ గ్రామాల మధ్య రాకపోకలకు ఈ లింకు రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. రహదారిపై ఆక్రమణల సమస్యను పరిష్కరించి, అవసరమైన మరమ్మతులు చేపడితే రెండు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.ముఖ్యంగా రైతులువ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగించేందుకు,పంట ఉత్పత్తుల రవాణాకు సౌలభ్యం కలగనుంది. అధికారులు రహదారి హద్దులను నిర్ధారించి తదుపరి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ పరిశీలన లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక సందడి

- కార్తీక సోమవారం శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- 365, 1008 వత్తులతో మహిళల దీపారాధనలు
- గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు





చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, నవంబర్ (16) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, వేములకుర్తి, ఫకిర్ కోండపుర్, బర్దిపుర్ ,ములరాంపుర్,ఎర్రండి,కోమటీకోండాపుర్, వర్షకోండ,డబ్బ,ఎర్రపుర్, ఇబ్రహీంపట్నం,అమ్మకపేట్, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామలలో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సమిపంలోని గోదవరి నదిలో భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు అచరించారు.అలాయలలో మహిళలు 365, 1008 వత్తులను వెలిగించి దీపారాధనలు చేశారు.ఆలయాలను దర్శించుకున్నారు.స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం హారతులు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.కార్తీక మాసం సోమవారం కావడంతో కుటుంబ సమేతంగా భక్తులు ఆలయాలకు చేరుకొని పరమశివుడిని దర్శించు కున్నారు.ఆలయ ప్రాంగణాలు దీపాల వెలుగులతో,శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి .ఈకార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

-ఆరేళ్ల బాలుడి దుర్మరణం

-మల్లాపూర్‌లో విషాదం



చురకలు విలేకరి, మల్లాపూర్,నవంబర్ 16 : పశువుల నీటి తొట్టిలో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మల్లాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన సూర అంజి, లావణ్య దంపతుల చిన్న కుమారుడు సూర బన్నీ (6) ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడి తల్లి లావణ్య రోజూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆమె పనికి వెళ్లగా పిల్లలు ఇంటి వద్ద ఆడుకుంటున్నారు. సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేసరికి చిన్న కుమారుడు కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామస్థులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామ చివరన ఉన్న పశువుల నీటి తొట్టిలో బాలుడు మునిగిపోయి కనిపించాడు. బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.అనిల్ తెలిపారు.

రాజారాంపల్లిలో పోలీసుల డాగ్ స్క్వాడ్ తనిఖీలు



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 16 : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ పోలీస్ సిబ్బంది గంజాయి,నిషేధిత మాధక ద్రవ్యాల నియంత్రణ లో భాగంగా ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ తో ఎండపల్లి మండలం రాజారాంపల్లి ప్రధాన రహదారిప్రాంతాల్లోని పలు షాపుల్లో సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని వివేకానంద చౌరస్తా ప్రాంతంలో ఉన్న కిరాణా దుకాణాలు, టీ స్టాళ్లు, పాన్ షాపులు, బస్టాండు మరియు అనుమానాస్పద ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తు ను నాశనం చేస్తాయని, ఆరోగ్యంతోపాటు కుటుంబం, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. అలాంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా కొనసాగు తుందని,తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

కోటిలింగాలలో గోదావరి కార్తీక దీప హారతి



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 16 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి తీరంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాస సోమవారం పురస్కరించుకొని గోదావరి హారతి ఘనంగా నిర్వహించా రు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కోస్న కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ధర్మకర్తలు అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పోషించని కారుణ్య ఉద్యోగి

-ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 16 : జగిత్యాల పట్టణానికి చెందిన సయ్యద్ సమి అనే వృద్ధ తండ్రి అనారోగ్య కారణాలతో తాను పని చేస్తున్న ఆఫీస్ స భార్డినేట్ ఉద్యోగం నుంచి తప్పుకొని తన పెద్ద కొడుకు సయ్యద్ సోహెల్ కు అనారోగ్య కారుణ్య నియమాక పథకం కింద 7 ఏళ్ల కింద ఉద్యోగం ఇప్పించగా అప్పటి నుంచి తల్లి దండ్రులకు వైద్య, పోషణ ఖర్చులు ఇవ్వక పోవడం తో పలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని మాకు ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం కింద, కారుణ్య నియమక రూల్స్ మేరకు ప్రతినెలా రూ. 10 వేలు తన పెద్ద కొడుకు నుంచి ఇప్పించాలని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయ వాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి, ఆయన సాయం తో సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో ఆ తండ్రి సయ్యద్ సమి విలేకరులకు తన గోడు వినిపించారు. జగిత్యాల మున్సిపాలిటీలో ఆఫీస్ సభార్డినేట్ గా పని చేస్తున్న తాను అనారోగ్యంతో ఉద్యోగం నుంచి తొలగి తన పెద్ద కొడుకు సయ్యద్ సోహెల్ కు 7 ఏళ్ల కిందట ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించగా జగిత్యాల మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్నాడని 7 ఏళ్ల నుంచి నుంచి ఇప్పటి వరకు తల్లి దండ్రుల మైన మాకు వైద్య పోషణ ఖర్చులు ఇవ్వక పోవడముతో పలు ఆర్థిక, శా రీరక ఇబ్బందులు పడుతున్నందున తమకు ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం – 2026,కారుణ్య నియామకం రూల్స్ మేరకు ప్రతి నెలా రూ. 10 వేలు తన పెద్ద కొడుకు సయ్యద్ సోహెల్ నుంచి ఇప్పించాలని కలెక్టర్ ను ప్రజావాణిలో కోరగా తగు సత్వర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, మాజీ టీ ఉద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడు తూ అనారోగ్య, మెడికల్ ఇన్ వాలిడేషన్ పథకం రూల్స్ మేరకు తల్లి దండ్రులను పోషించని కొడుకు ఉద్యోగం నుంచి జిల్లా కలెక్టర్ సస్పెండ్ లేదా డిస్మిస్ చేసే వీలుందని, అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం – 2026 కింద ఆ ఉద్యోగికి ప్రతి నెలా వచ్చే వేతనం నుంచి రూ. 10 వేలు నేరుగా కట్ చేసి ఆ తండ్రి బ్యాంకు ఖాతాలో జమ చేయుటకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తారని, గతం లో ఇద్దరు కారుణ్య ఉద్యోగుల పైన జిల్లా ఉన్నతాదిధికారులు తీసుకున్న చర్యలను వివరించారు. వృద్ధ తండ్రి సయ్యద్ సమి వెంట సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, జగిత్యాల డివిజన్ కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణ,ఛేదనలో

సీసీ కెమెరాలు అత్యంత కీలకం

-ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



చురకలు విలేకరి, మెట్‌పల్లి, నవంబర్ 16 : నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని, ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరాల ఛేదనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 గ్రామంలో ఏర్పాటు చేసిన 35 సీసీ కెమెరాలను,పోలీస్ స్టేషన్ను అనుసంధా నం చేసి ప్రారంభించారు.ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీసీ కెమెరాలు ప్రతి గ్రామానికి, ప్రతి కాలనీకి, ప్రతి వ్యాపార సంస్థకు అదనపు భద్రతను కల్పించే సమర్థవంతమైన సాధనంగా మారాయ న్నారు. నేరాలను అరికట్టడంలో, నేరస్థులను గుర్తించి త్వరితగతిన పట్టుకోవడంలో సీసీ కెమెరాల ద్వారా లభించే దృశ్యాలు అత్యంత కీలకమైన ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాందోళనలు ఏర్పడి నేరాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు, చోరీలు ,గొడవలు,జరిగే నేరాలు మరియు ఇతర సంఘటనల విచారణలో సీసీ కెమెరాల ఫుటేజీ కీలక సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత భద్రతతో పాటు తమ రక్షణ కోసం ప్రతి ఇల్లు, వ్యాపార సంస్థ, దుకాణం, అపార్ట్మెంట్ మరియు ఇతర ప్రాంగణా ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవా లని సూచించారు. మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గసాగర్ (10), మెట్ల చిట్టాపూర్ (06), అరపేట (04), విటం పేట (09), బంతు పేట్(06) గ్రామంలో ఏర్పాటు చేసిన 35 సీసీ కెమెరాలు గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మెట్ పల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని తమ గ్రామాలను మరింత సురక్షితంగా తీర్చిదిద్దాలని కోరారు. అలాగే ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్‌స్టేషన్కు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్య క్రమంలో డీఎస్పీ రాములు, ఇన్స్పెక్టర్లు సురేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్ కుమార్, రాజు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరిపల్లె మోడల్ స్కూల్లో చదువులతల్లి విగ్రహప్రతిష్ఠ

చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 16 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్లో సోమవారం సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గ్రామసర్పంచ్ జక్కుల ఆమనిమహేష్ ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ఠ



ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లిగా కొలిచే సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని పాఠశాల లో ప్రతిష్ఠించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ సందీప్ రాజు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలుగావించారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ జక్కుల చందు,నాయకులు పాఠశాల కార్యవర్గం,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో పాత్రికేయ"త్రయం" సత్తా

-గెలుపొందిన ముగ్గురు పాత్రికేయులు
-కార్యదర్శిగా కట్కూరి, ఈసీ సభ్యులుగా ధర్మ, నరసింహ
-ఈసీ ఎన్నికల అత్యధిక ఓట్లు సాధించిన ఇద్దరు పాత్రికేయులు



(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)

హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను మైమరిపించాయి. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు పాత్రికేయులు విజయం సాధించి ఔరా అనిపించారు.కార్యదర్శిగా పోటీ చేసిన సీనియర్ పాత్రికేయుడు కట్కూరి మల్లారెడ్డి (వార్త మల్లన్న) తన ప్రత్యర్థి పై సుమారు 45 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈసి సభ్యులుగా పోటీ చేసిన ఆంధ్రజ్యోతి ఆర్ సి ఇంచార్జ్ గడ్డం ధర్మారెడ్డి 207 ఓట్లు, మరో సీనియర్ పాత్రికేయుడు కేసిరెడ్డి నరసింహారెడ్డి 206 ఓట్లు సాధించి సంచలనం సృష్టించారు.ఈసీ సభ్యుల పోటీలో వీరిద్దరికి ఎక్కువ సంఖ్యలో ఓట్లు రావడం గమనార్హం.ఇందులో కేశిరెడ్డి నరసింహారెడ్డి సతీమణి కేశిరెడ్డి లావణ్య వరుసగా నాలుగోసారి హుజురాబాద్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ గా ఎన్నికై సంచలనం సృష్టించింది. కార్యదర్శిగా ఎన్నికైన కటుకూరి మల్లారెడ్డి ఈ ఏడాది జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజపల్లి గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో ముగ్గురు పాత్రికేయులు విజయం సాధించడం హర్షనీయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకవైపు పాత్రికేయులుగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకు వెళ్తూ వాటిని పరిష్కరిస్తూ అందరి పొందుతూనే.. మరోవైపు ప్రజా క్షేత్రంలో కూడా సందర్భానుసారం తమ సత్తాను చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఉన్న కాయిత రాములు గతంలో సైదాపూర్ మండలం లక్ష్మన్న పల్లి సర్పంచ్‌గా ఎన్నికై సేవ లందించారు.హుజురాబాద్‌పాత్రికేయుడు గోస్కుల రాజు ఈ ఏడాది జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్గా ఎన్నికయ్యాడు. అలాగే వేల్పుల సునీల్ చెల్పూర్‌లో వార్డు సభ్యునిగా ఎన్నిక య్యాడు.పాత్రికేయులు, పాత్రికేయంపై అక్కడక్కడ విమర్శలు కూడా వస్తున్న ఈ రోజుల్లో.. హుజురాబాద్ పాత్రికేయులు ఒకవైపు తమ వృత్తిలో రాణిస్తూనే మరోవైపు ఎన్నికల్లోను తమ సత్తాను చాటుతున్నారు. పాత్రికేయులపై హుజురాబాద్ లో ఉన్న నమ్మకాన్ని విశ్వాసాన్ని మంచితనాన్ని ఈ గెలుపు సూచిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన పాత్రికేయులను సీనియర్ పాత్రికేయులు కోరెం సుధాకర్ రెడ్డి, తిరునగరి ఆంజనేయస్వామి, మామిడి రవీందర్, జీలుగుల తిరుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు,కామణి రవీందర్, పాత్రికేయులు అల్లి నరేందర్, కుడికాల సురేష్ బాబు, మహేష్, హర్షవర్ధన్, పిల్లల సతీష్, మనీషా ప్రసాద్, మండల యాదగిరి, సూర్య పరంకుశం కిరణ్ కుమార్, బాబురావు, పబ్బ తిరుపతి, పడాల రమేష్, తిరుపతి రెడ్డి, దేవేందర్, రజనీకాంత్, నాగవెల్లి రాజు, భరణి, బండి సాయి కృష్ణ, చందు, సృజన్, దాము, రాజు, సత్యరాజ్, మాక్సుద్, గోలి నర్సింహారెడ్డి,కేదాసి శ్రీధర్, తాళ్లపల్లి మహేష్,టేకుల సాగర్, సాయిలు,సంపత్, వెంకటేష్, స్వామి, గోపాలరావు తదితరులు అభినందనలు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న కేటీఆర్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 16 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి సిరిసిల్ల శాసనసభ్యులు మాజీ మంత్రి బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం హాజరయ్యారు, ఈ సందర్భంగా స్థానిక గౌడ సంఘం అధ్యక్షులు దేవయ్య గౌడు ఆలయ నిర్మాణ చైర్మన్ పందిళ్ళ లింగం గౌడు ఆధ్వర్యంలో గౌడ సంఘ ప్రతినిధులు కేటీఆర్ కు ఆయనతో పాటు పాల్గొన్న టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాజీ జెడ్పిటిసి సభ్యులు ఒడ్నాల నరసయ్యకు బిఆర్ ఎస్ పార్టీ నాయకులకు ఘన స్వాగతం పలికారు.గర్భగుడిలోకి వెళ్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి వారు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించు కున్నారు.బ్రాహ్మణోత్తములు కేటీఆర్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వివిధ వర్గాల ప్రజలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ తో పోటీపడి ఫోటోలు దిగారు,శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పందిర్ల పర్ష రాములుగౌడు తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విందు భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు రవీందర్‌రావు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య జిల్లా లోని వివిధ మండలాల నుండి వచ్చిన బిఆర్ఎస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు .విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని స్థానిక సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి , ఏఏంసి మాజీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి అందే సుభాష్, పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్, బిఆర్ఎస్ పార్టీకి చెందిన వివిధ హోదాల్లా ఉన్న నాయకులు సర్పంచులు ఉప సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల, బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన



-రూ.2.50 లక్షల విరాళం అందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 16 : వీణవంక మండలం లోని రెడ్డిపల్లితో పాటు అనుబంధ గ్రామాలైన అచ్చంపల్లి,కొత్తపల్లిలో సోమవారం ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.గ్రామ దేవతలు శ్రీ భూలక్ష్మి మహాలక్ష్మి అమ్మవార్లు, నాభి శిల (బొడ్రాయి),నూతన పోచమ్మ దేవాలయాలలో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు వేద మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి హాజరై, గ్రామ దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం గా రూ. 2,50,000 విరాళాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు.అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి,మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి,సర్పంచ్లు అడిగోప్పుల సత్యనారాయణ,పోతుల నర్సయ్య,మాజీ ఎంపిటిసి లక్ష్మి భూమయ్య,ఉప సర్పంచ్ ఉయ్యాల రాణి రాజు,గుంటీ తిరుపతి, కొత్తపల్లి, అచ్చంపల్లి గ్రామాల ప్రజలు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజ ప్రారంభం



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 16 : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ గ్రామంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో మండల పూజ మహోత్సవాల భాగంగా ఈరోజు శబరిమలలో ఏవిధంగా పూజ కార్యక్రమంలు ఉండునో అదేవిధంగా నిర్వహించారు.ఉదయం 5:30నిలకుస్వామి వారికి సుప్రభాత పూజ,గణపతి పూజ, సుబ్రహ్మణ్య పూజ,పరివార దేవతాపూజ,గణపతి హోమం,ధ్వజారోహణం, అష్టదిక్పాలకుల,పూజ, నవగ్రహ పూజ,అయ్యప్పస్వామి వారికి విశేష అష్ట భిషేకంలు,పుష్పాభిషేకం.మహానివేదన,కర్పూరణీరాజనం,మంత్రపుష్పం,వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.కార్యక్రమంలో మండలం లోనిఅయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

సింగసముద్రం, జక్కుల చెరువు నీటితో సాగునీరు అందించాలి

-కలెక్టర్‌కు బొప్పాపూర్ రైతుల వినతిపత్రం



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 16 : రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగసముద్రం, జక్కుల చెరువు నీటి ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించి పంటలను కాపాడాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ను రైతులు కోరారు.రైతుల ప్రయోజనాల కోసం బొప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వివిధ కులాల రైతులు కలెక్టర్‌ను కలిశారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పిటిసి సభ్యులు




చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 16 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన సందర్భంగా సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీమంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఎల్లారెడ్డిపేట మాజీ జెడ్పిటిసి సభ్యులు వడ్నాల నరసయ్య మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఆయనతోపాటు తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల్ స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు మేగీ నరసయ్య, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు అంజిరెడ్డి రవి చంద్రం తదితరులు కలిశారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చురకలు విలేఖరి,వీణవంక, నవంబర్ 16 : మండలంలోని కనపర్తి, మామిడాలపల్లి, ఇప్పలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సోమవారం డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏపీఎం సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి రైతులు తమ ధాన్యాన్ని శుభ్రపరుచుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందవచ్చని తెలిపారు. అలాగే, గ్రామాలలోని ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ సదుపాయాన్ని అమర్చుకోవాలని, జీపీఎస్ అనుసంధానం ఉన్న వాహనాలలో తరలించిన ధాన్యానికి మాత్రమే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ (క్రెడిట్)అవుతాయని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు మహిళా ఉమాదేవి శ్యాంసుందర్ రెడ్డి, శ్రీరామోజు చంద్రమౌళి, మెతుకు కోమల్ రెడ్డి, మండల కుమారస్వామి, సీసీలు ఘనశ్యామ్, ఆనంద్,వి.తిరుపతి, మామిడి పద్మ, ఎస్.తిరుపతి,వివోఏలు ప్రేమలత, స్వరూప, కమిటీ సభ్యులు,మహిళలు, హమాలీ సంఘ నాయకులు,రైతులు హాజరయ్యారు.

డిజిటల్ స్టూడియో, ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి




చురకలు విలేఖరి,మానకొండూర్ నవంబర్ 16 : మండల కేంద్రంలో కాంగ్రెస్ యువ నాయకుడు కోండ్ర సురేష్ నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య డిజిటల్ స్టూడియో, ఆన్‌లైన్ సెంటర్‌ను సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియో, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు కోండ్ర సురేష్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలోమానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మానకొండూర్ పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, మంద బక్కారెడ్డి, తమిశెట్టి రాజేష్, సాయిరి దేవయ్య, వంగల మధు, మాతంగి సహదేవ్, ఇర్ఫాన్, మడుపు ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి నరేష్, శంకర్, బోళ్ల మురళీధర్, మ్యాడ తిరుపతిరెడ్డి, కనకం అశోక్, కనకం కుమార్, కుంభం చిరంజీవి, బండెల మహేందర్, గుడాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే పరిశీలించిన తహసిల్దార్



చురకలు ప్రతినిధి,కమాన్‌పూర్ పాలకుర్తి నవంబర్ 16 : పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామంలో భూ రిసర్వే పనులను పరిశీలించిన పాలకుర్తి తహసిల్దార్ కోటేశ్వర్ రావు పరిశీలించారు.రాణాపూర్ గ్రామాన్ని సందర్శించి సర్వే పనులు పరిశీలించారు.రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ భూమి కలిగి ఉన్న ప్రతీ రైతు తప్పక సర్వేలో పాల్గొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు .తద్వారా భవిష్యత్‌లో ఎలాంటి బూ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు.సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులందరూ రైతులను చైతన్య పరిచి సర్వే త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇటుకల ప్రవంతి శ్రీకాంత్, ఉపసర్పంచ్ దుర్శేట్టి నాగమణి మరీను,వార్డు సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

వంగరలో తుది దశకు చేరుకున్న పీవీ విజ్ఞాన వేదిక పనులు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 16 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్మారకార్థం ఆయన స్వగ్రామమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా, భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న 'పీవీ విజ్ఞాన వేదిక పార్క్' పనులు తుది దశకు చేరుకున్నాయి. నేటితరం విద్యార్థులకు పీవీఆశయాలను పరిచయం చేసే ఉద్దేశంతో 4.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.7కోట్ల వ్యయంతో ఈ పార్కును ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం,ఆడిటోరియం,ధ్యాన కేంద్రం,యాంఫీథియేటర్,నృత్య కేంద్రంతో పాటు రంగురంగుల మొక్కలతో కూడిన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు.పీవీ నరసింహారావు మొదటి సారి ఉపయోగించిన పర్సనల్ కంప్యూటర్,ఆయన వాడిన విలువైన వస్తువులను ఈ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించనున్నారు. అలాగే ప్రధానిగా ఉన్న సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు ఆయనకు అందించిన బహుమతులు,వారితో దిగిన ఛాయా చిత్రాలను మ్యూజియం మరియు ఫోటో గ్యాలరీలో ఉంచనున్నారు.మొదట వారి పూర్వీకుల ఇంటి వెనుక దీనిని నిర్మించాలని కుటుంబ సభ్యులు భావించినప్పటికీ, ఆ తర్వాత గ్రామ ముఖద్వారంలోని పీవీ నగర్‌కు మార్చారు. ప్రభుత్వ స్థలంలోని పాత హాస్టల్, ఆసుపత్రి క్వార్టర్లను తొలగించి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఈ పనులను చేపట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు నిధుల కొరత వల్ల మొదట ఆలస్యమైనా,తర్వాత వేగం పుంజుకున్నాయి.దాదాపు పనులన్నీ పూర్తయ్యాయని, తుది మెరుగులు మాత్రమే మిగిలి ఉన్నాయని గ్రామ సర్పంచ్ గజ్జల సృజన తెలిపారు.మిగిలిన పనులు పూర్తి కాగానే దీనిని ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగంసన్నాహాలు చేస్తోంది.

సైక్లింగ్ క్రీడలతోనే బంగారు భవిష్యత్తు

-తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి
-ఉమ్మడి కరీంనగర్ టీంను అభినందించిన ప్రతినిధులు



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) నవంబర్ 16 : ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్ క్రీడకు మంచి గుర్తింపు ఉందని... సైక్లింగ్ క్రీడలతో బంగారు భవిష్యత్తు ఏర్పడుతోందని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు.సోమవారం ఉదయం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ వెలోడ్రాం లో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ (సౌత్ ఇండియా జోన్) క్రీడా పోటీల ప్రారంభం అయ్యాయి. ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సైక్లింగ్ టీం పాల్గొని ప్రశంసలు అందుకుంది. కరీంనగర్ టీం ను ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారతీయ రైల్వేలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ శాఖల తోపాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో స్పోర్ట్స్ కోటా కింద నేరుగా ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు.సైక్లింగ్ కు సంబంధించిన రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ఉన్నత విద్యా కోర్సులలో ప్రత్యేక స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్ కాంతారావు, సైక్లింగ్ కోచ్ చంద్రారెడ్డి, మ్యాక్స్ వెల్ పెద్దపెల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అసంపల్లి శ్రీనివాస్, సెక్రటరీ తగరపు శంకర్, కరీంనగర్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సురభి వేణుగోపాల్, సుల్తానాబాద్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అండగానిలిచిన టీఆర్ఎస్

-సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
-ఎస్ స్వప్నటీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ 16 : ఆశా వర్కర్లను గోసపుచ్చు కుంటున్న సర్కార్ వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలి. పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా కు దిగారు.వారికి మద్దతు తెలిపిన టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు సిరవేణి స్వప్న హాజరైమాట్లాడారు.ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆమె కలెక్టరేట్‌లో దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు.ఈ ధర్నాకు టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిరవేణి స్వప్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్య ఆరోగ్య శాఖ లోనే ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. అలాంటి ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు.ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు తమ పార్టీ అండగా ఉంటుందని, వారి పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని స్వప్న పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సాగర్ల వాసవి,మల్లికార్జ శ్రీకాంత్ కర్యకర్తలు,వర్కర్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి,బీఆర్ఎస్ నాయకులు పల్లకొండ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో కేసీఆర్ చారిత్రాత్మక పోరాటాన్ని కొనియాడారు. ఈ ఆత్మీయభేటీలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమంతో పాటు ఎరుకలు,ఇతర బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం,రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి కేసీఆర్ ప్రతీకని, ఉద్యమ స్ఫూర్తితో సామాజిక న్యాయంకోసం నిరంతరం కృషి చేస్తామని సుధాకర్ పేర్కొన్నారు.

29న కరీంనగర్ దీక్ష దివస్ విజయవంతం చేయండి

-హుజురాబాద్ నుండి భారీ జన సమీకరణ
-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
-కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయక రైతులను ఇబ్బంది పెడతారా?



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 16 : కరీంనగర్ నగరంలో ఈనెల 29న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.సభ ఏర్పాట్లు, జన సమీకరణ, మండలాల వారీగా నాయకులు, కార్యకర్తల బాధ్యతలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.ప్రతి గ్రామం నుంచి ప్రజలు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగునీటి కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. లానినో ప్రభావం పేరుతో రైతుల సమస్యలను పక్కదారి పట్టించలేరని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువు అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సక్రమంగా నీటిని ఎత్తిపోయక పోవడం వల్లే రైతులు పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలు మాని, తక్షణమే కాళేశ్వరం నుంచి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసే దీక్షా దివస్ సభకు నియోజక వర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులందరూ ఐక్యంగా కదిలి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, ప్యాక్స్ చైర్మన్ సంపత్ రావు, కొండల్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు, గండె శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ బాలకిషన్‌రావు,మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

-హుజురాబాద్ నియోజకవర్గం రూ 1000 కోట్లు కేటాయించాలి
-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
-హుజరాబాద్ లో కొత్త పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 16 : అర్హులైన పేద కుటుంబాలన్నింటికీ పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వెంటనే అందించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హుజురాబాద్ పట్టణంలోని ప్రతాప సాయి గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల మందికి, హుజురాబాద్ నియోజకవర్గంలో 44,373 మందికి పెన్షన్లు అందించి పేదలకు అండగా నిలిచామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీ ప్రకారం వృద్ధాప్య, వితంతు పెన్షన్లను 2,000 నుంచి 4,000కు, వికలాంగుల పెన్షన్లను 4,000 నుంచి 6,000కు తక్షణమే పెంచాలని కోరారు. అలాగే దళిత బంధు పథకం పొందారనే కారణంతో ఆ కుటుంబాల్లోని అర్హులకు పెన్షన్లను నిరాకరించవద్దని సూచించారు. రాజకీయ వివక్ష లేకుండా హుజురాబాద్ పట్టణ అభివృద్ధికి 100 కోట్లు, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి 1,000 కోట్ల ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం అసెంబ్లీ వేదికగా నిరంతరం పోరాడుతూనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆర్ సుహాసినితో పాటు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ఏంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్

ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాల్సిందే

-రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరిక



చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్ 16 : ఇచ్చిన హామీ ప్రకారం నేషనల్ హెల్త్ మిషన్ లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమ్మె కాలంలో నిలిపివేసిన వేతనాన్ని పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగుల పక్షాన తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈరోజు పలువురు ఎన్ఎహెచ్ఎం ఉద్యోగ సంఘం జేఏసీ అధ్యక్షులు రమేశ్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కరీంనగర్‌లోని తన నివాసంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందించారు.ఎన్ హెచ్ఎంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులందరికీ 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని, జీవో నెం 60ను అమలు చేయడంతోపాటుజీవో నెం 1195 ప్రకారం వేతనాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలోకి తీసుకురావాలి. స్పర్శ్ విధానం ద్వారా జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అట్లాగే ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ పీఆర్సీ ప్రయోజనాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా సమ్మె కాలానికి పూర్తి వేతనాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ హామీలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, 90 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందునే సమ్మెను విరమించామని తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆయా ఉద్యోగుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులున్నారు.

విద్యార్థి ప్రతిభకు 25వేల పారితోషికం అందజేసిన ఎంపీ వంశీకృష్ణ



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 16 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థి వెంకటేష్ ఇన్నోవేషన్ ప్రతిభను గుర్తించి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రకటించిన 25 వేల నగదు పారితోషికాన్ని సోమవారం అందజేశారు.విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకు నేందుకు పేదరికంఅడ్డంకి కాకూడదని,ఉన్నత విద్యతో పాటు టాలెంట్, స్కిల్స్ ఉన్న విద్యార్థులనుప్రోత్సహించడం కోసం తాను అండగా ఉంటాన ని ఇచ్చిన మాటకు కట్టుబడి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మోడల్ స్కూల్లో ఇంటర్ 2 వ సంవత్సరం చదువుతున్న నిరుపేద విద్యార్థి ఇన్నోవేషన్ క్రియేటర్ ఎం,వెంకటేష్‌కు ఆర్థిక సహాయం అందించి అభినందించారు.రెండు రోజుల క్రితం పాఠశాలను సందర్శించిన ఎంపీ వంశీ కృష్ణ ముందు మహిళల ఆత్మరక్షణ కోసం విద్యార్థి వెంకటేష్ రూపొందించిన వినూత్న 'స్టెన్ గన్' పరికరం ప్రదర్శించడంతో విద్యార్థి ప్రతిభను చూసి ఈ పారి తోషికం అందజేశారు. ప్రతిభా వంతులైన విద్యార్థుల ఇన్నో వేషన్‌లకు 'కాక్ గ్రోత్ ఫండ్' అండగా ఉంటుందని, వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకు వచ్చే విద్యార్థులు ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు.వెంకటేష్ ప్రతిభనుగుర్తించి పారితోషికం అందజేసినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్ రాజ్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, మాజీ ఉపసర్పంచ్ ముచ్చర్ల తిరుపతి తదితరులు ఎంపీ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్ 15 నుంచి ఆశాల నిరవధిక సమ్మె



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 16 : ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్ డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) హెచ్చరించింది. సోమవారం జిల్లా కలెక్టర్ కు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్రంలో 28 వేల మంది ఆశాలు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని, ప్రస్తుతం రూ.9,900 పారితోషికమే ఇస్తున్నారని, 5 ఏళ్లుగా పెంపు లేదని తెలిపారు. గర్భిణీలు, శిశు సంరక్షణ, సర్వేలు, పోలియో తదితర పనులతో పని భారం పెరిగిందని పేర్కొన్నారు.2023లో 15 రోజుల సమ్మె చేసినప్పుడు ఐఏఎస్ కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటి చంద్రశేఖర్, ఆశా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నరసింహకు పండ్ల వ్యాపారుల సన్మానం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 16 : హుజూరాబాద్ క్లబ్ ఈసీ సభ్యునిగా ఎన్నికైన కేసిరెడ్డి నరసింహారెడ్డిని స్థానిక అంబేద్కర్ కూడలి తన వ్యాపారులు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సమ్మయ్య మాట్లాడుతూ.. నరసింహారెడ్డి ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆయన సహకారం పండ్ల వ్యాపారులకు ఇందిరా మార్గం వ్యాపారులకు ఎంతగానో ఉందన్నారు. ఏ ఆపద వచ్చిన ముందుంటారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఒకవైపు నరసింహారెడ్డి పాత్రికేయునిగా పనిచేస్తుండగా మరోవైపు ఆయన సతీమణి కేసిరెడ్డి లావణ్య కౌన్సిలర్ గా సేవలందిస్తున్నారని, ఆమె నాలుగు సార్లు గెలిచి ఏనాడూ తమకు చిన్న ఆపద కూడా రాకుండా చూసుకున్నారని ప్రశంసించారు. నరసింహారెడ్డి భవిష్యత్తులో మరెన్నో పదవులు నిర్వహించాలని, తమ మద్దతు ఆయనకు ఎల్లవేళలా ఉంటుందని ఆకాంక్షించారు.

హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో 'కట్కూరి - పుల్లూరి' ప్యానెల్ విజయం

-సంయుక్త కార్యదర్శి, మూడు ఈసీ పదవులు దక్కించుకున్న 'ముచ్చ' ప్యానెల్

-హోరాహోరీగా సాగిన పోరు

-ఓటేసిన 300 సభ్యులు





చురకలు ప్రతినిధి హుజురాబాద్, నవంబర్ 16 : అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా ఎంతో ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా జరిగిన హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో 'కట్కూరి మల్లారెడ్డి - పుల్లూరి ప్రభాకర్ రావు' ప్యానెల్ పైచేయి సాధించింది. ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ ఎన్నికల్లో 'ముచ్చ నారాయణ రెడ్డి' ప్యానెల్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, కీలక పదవులను కట్కూరి-పుల్లూరి వర్గం కైవసం చేసుకుంది. క్లబ్ అధ్యక్షునిగా అధికారిక హోదాలో ఆర్డీవో వ్యవహరిస్తుండగా, మిగిలిన కీలక పదవులకు ఎన్నికలు జరిగాయి.ఇందులో ప్రధాన కార్యదర్శిగా కట్కూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్ రావు, కోశాధికారిగా గర్రెపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 'ముచ్చ' ప్యానెల్ తరపున పోటీ చేసిన శివనాధుని వేణు సంయుక్త కార్యదర్శిగా విజయం సాధించారు.

ఈసీ పదవులకు గట్టి పోటీ.. డ్రా వరకు వెళ్లిన ఫలితం

క్లబ్ లోని 9 కార్యవర్గ సభ్యుల (ఈసీ) పదవులకు గాను 21 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇందులో సీనియర్ పాత్రికేయులు అత్యధిక ఓట్లతో సత్తా చాటారు. ఆంధ్రజ్యోతి ఆర్సీ ఇంచార్జి గడ్డం ధర్మారెడ్డి 207 ఓట్లు, సీనియర్ పాత్రికేయుడు కేసిరెడ్డి నర్సింహా రెడ్డి 206 ఓట్లు సాధించి సంచలనం సృష్టించారు. వీరితో పాటు మేకల రాజిరెడ్డి,గోలి సురేష్, పొనగంటి శ్రవణ్, అకినపల్లి అనిల్ గెలుపొందారు. ముచ్చ ప్యానెల్ నుండి పుల్లూరి శ్రీకాంత్, దొనకొండ సత్యనారాయణ రెడ్డి విజయం సాధించారు. తొమ్మిదో ఈసీ స్థానం కోసం పోటీ పడిన కొలె కళ్యాణ్ (ముచ్చ ప్యానెల్), మాగంటి శ్రీధర్ లకు సమానంగా 110 ఓట్లు రావడంతో, విజేతను తేల్చేందుకు డ్రా తీయాలని నిర్ణయించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

క్లబ్‌లోని మొత్తం 330 మంది సభ్యులకు గాను 300 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎంపీ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, కాంగ్రెస్ నేత ప్రణవ్, ఇంద్రనీల్, వొడితల శ్రీనివాసరావు, కిషన్ రావు తదితరులు ఓటు వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగాయి. అభ్యర్థులు మద్దతుదారులతో క్లబ్ వద్ద సభ్యుల హడావిడి కనిపించింది. గత వారం రోజులుగా క్లబ్ ఎన్నికలతో హుజురాబాద్ లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. వ్యూహాలు ప్రతి వ్యూహాలతో ఎత్తులు పైఎత్తులతో క్లబ్ రాజకీయాన్ని రక్తి కట్టించారు. ఇప్పటివరకు అన్ని ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి కానీ ఈసారి మాత్రమే ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నిక జరిగింది.

విజేతల నేపథ్యం, వ్యూహాత్మక ప్రచారం

హుజురాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన కట్కూరి మల్లారెడ్డి, విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘ కాలంగా పాత్రికేయునిగా కొనసాగుతున్న ఆయన, ఈ ఏడాది జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజపల్లి సర్పంచ్‌గా గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యక్షునిగా గెలిచిన పుల్లూరి ప్రభాకర్ రావు నాగార్జున డెయిరీ చైర్మన్‌గా, ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందారు. సంయుక్త కార్యదర్శి శివనాధుని వేణు, కోశాధికారి గర్రెపల్లి శ్రీనివాస్ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యాపారవేత్తలు. క్లబ్ చరిత్రలో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలు జరగడంతో, గత పది రోజులుగా అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా, వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలుస్తూ వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహించారు.

కెప్టెన్ మార్గదర్శనంలో క్లబ్ అభివృద్ధి: కట్కూరి - పుల్లూరి

తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన సభ్యులకు ప్రధాన కార్యదర్శి కట్కూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు పుల్లూరి ప్రభాకర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు ముగిశాయని, క్లబ్ పాలనలో పూర్తి పారదర్శకతతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని వారు పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావుండదని, క్లబ్ బడ్జెట్, లెక్కలను ఎప్పటికప్పుడు సభ్యుల ముందుంచుతామని హామీ ఇచ్చారు. దివంగత మాజీ రాజ్యసభ సభ్యులు సింగాపురం రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు గార్లు ఈ క్లబ్‌ను కాపాడి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కెప్టెన్ గారి మార్గనిర్దేశంలో, సభ్యులందరి సహకారంతో క్లబ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చురకలు ప్రతినిధి,జగిత్యాల, నవంబర్ 16 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని 605 మంది లబ్ధిదారులకు నూతన చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద 8 మందికి రూ.9.28 లక్షల చెక్కులు, సీఎంఆర్ఎఫ్ కింద 125 మందికి రూ.42.38 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేయూత పింఛన్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు సహాయం అందిస్తున్నామని, అనారోగ్యంతో బాధపడే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎంఐఎం 34డివిజన్ నేత ఖాజ మజారుద్దీన్ తండ్రి మృతి

-చిగురుమామిడి వాస్తవ్యులు ఖాజ ఇంకేశాఫోద్దీన్ (బాబూమియా) గుండెపోటుతో మృతి

-సంతాపం తెలిపిన ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్..తదితరులు



కరీంనగర్, నవంబర్ 16 : ఎంఐఎం 34వ డివిజన్ అధ్యక్షుడు, కాంటెస్ట్ డ్ కార్పొరేటర్ ఖాజ మజారోద్దీన్ తండ్రి ఖాజ ఇంకేశాఫోద్దీన్ అలియాస్ బాబూమియా(70) గుండెపోటుతో ఆదివారం మరణించారు. మరణ వార్త తెలిసిన వెంటనే ఎంఐఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు కార్పొరేటర్లు, నాయకులు, ఇస్లామీయ ధార్మిక పండితులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, 34వ డివిజన్ ప్రజలు, కుల, మతాలకు అతీతంగా ఖాజా మాజారోద్దీన్, హుస్సేనిపురలోని వారి నివాసానికి పెద్ద ఎత్తున చేరుకొని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిగురుమామిడి వాస్తవ్యులైన బాబూమియా నగరంలో ప్రముఖ సామిల్ వ్యాపారిగా ప్రసిద్ధి చెందారు. చిన్నప్పటి నుంచి తన తండ్రి ఖాజా ఖమరొద్దీన్ నుంచి వచ్చిన టేకు కర్ర వ్యాపారాన్ని పునికిపుచ్చుకొని, చిగురుమామిడి నుంచి కరీంనగర్ కు, తన తండ్రి సూచనల మేరకు మకాం మార్చి, నగరంలో సామిల్ వ్యాపారాన్ని నిర్వహించారు. వివాదరహితుడిగా, మంచికి మారుపేరుగా హుస్సేనిపురా ప్రాంతంలో మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు. ఖాజా ఇంకేశాఫోద్దీన్ కు, 3గ్గురు సోదరులు, ఇద్దరు పోలీసు అధికారులుగా, ఒకరు ఆర్టీసీలో రిటైర్ అయ్యారు. ఇద్దరు కుమారులు సైతం సామిల్ టేకు కర్ర వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిగింది.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

-బాలల నుంచి అర్జీల స్వీకరణ.. పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

-కలెక్టర్ గరిమ అగ్రవాల్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 16 :

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన బాలల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించాలని, విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పించాలని కోరుతూ బాలలు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే ప్రత్యేక ప్రజావాణి ప్రధాన ఉద్దేశమన్నారు. బాలలకు మెరుగైన భవిష్యత్తు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సత్వర పరిష్కారం చూపడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డుపై "చిల్డ్రన్.. యూ ఆర్ ద ఫ్యూచర్.. ఫ్రై హై.. వీ ఆర్ విత్ యూ"అనే సందేశాన్ని కలెక్టర్ రాసి సంతకం చేశారు. బాలల భవిష్యత్తుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం అండగా ఉంటుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

